క్లుప్తంగా

ఉచితంగానే స్మార్ట్ రైస్ కార్డులు



లబ్ధిదారులకు కార్డులు అందజేస్తున్న తహసీల్దార్ చిరంజీవి

మార్కాపురం: మార్కాపురం మండలానికి సంబంధించి 32,535 స్మార్ట్ రైస్‌కార్డులు వచ్చాయని, సచివాలయ సిబ్బంది, సంబంధిత డీలర్ల ద్వారా ఉచితంగా కార్డుదారులకు అందజేస్తామని తహసీల్దార్ చిరంజీవి తెలిపారు. సోమవారం మార్కాపురం పట్టణంలోని కోనేటి వీధిలో పలువురు లబ్ధిదారులకు రైస్ కార్డులు అందజేశారు. కార్డులకు ఎవరూ డబ్బు చెల్లించాల్సిన పనిలేదని తహసీల్దార్ తెలిపారు.

బాలుడి అదృశ్యంపై కేసు నమోదు



చాణక్య (ఫైల్)

కొమరోలు: మండలంలోని తాటిచెర్ల గ్రామంలో ఓ బాలుడు కనపడకుండా పోవడంతో తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగరాజు సోమవారం తెలిపారు. తాటిచెర్ల గ్రామానికి చెందిన నల్లబోతుల వెంకటస్వామి కుమారుడు చాణక్య(14) ఈనెల 7వ తేదీ సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఎంతకీ తిరిగిరాకపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో వెంకటస్వామి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని, బాలుడి ఆచూకీ తెలిపిన వారికి తగిన పారితోషకం అందిస్తామని ఎస్సై పేర్కొన్నారు

రిటైర్డ్ ఉద్యోగులకు వైద్య పరీక్షలు

గిద్దలూరు రూరల్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్ఎస్ ప్లాజా ఫంక్షన్ హాల్లో సోమవారం రిటైర్డ్ ఉద్యోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ఆదామ్, డాక్టర్ రమణారెడ్డి రిటైర్డ్ ఉద్యోగులకు ఉచితంగా వైద్య పరీక్షలను నిర్వహించి వారికి అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ మేనేజర్ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన పెంపొందించుకోవాలి



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ

మార్కాపురం: పంచాయతీ కార్యదర్శులు జీఎస్టీపై అవగాహన కల్పించుకోవాలని ఎంపీడీఓ బాలచెన్నయ్య సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలను వివరించారు. ప్రజలకు ఈ వివరాలు తెలియజేయాలని సూచించారు. నూతన జీఎస్టీ శ్లాబులతో వివిధ రకాల వస్తువుల ధరలు తగ్గాయని చెప్పారు. అనంతరం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఓ భాగ్యవతి, ఏపీఓ నాగరాజు, డిప్యూటీ ఎంపీడీఓ వి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శనగ విత్తనాల రిజిస్ట్రేషన్

మార్కాపురం: మార్కాపురం వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో రైతులకు 25 శాతం సబ్సిడీపై బయోమెట్రిక్ విధానంలో శనగ విత్తనాల రిజిస్ట్రేషన్ కార్యక్రమం రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం నుంచి ప్రారంభమవుతుందని ఏడీఏ బాలాజీ నాయక్ తెలిపారు. శనగ విత్తనాలు అవసరమైన రైతులు పట్టాదారు పాసుబుక్, ఆధార్ కార్డు, మొబైల్ నంబర్‌తో వీఏఏలను సంప్రదించి, సంబంధిత నగదును చెల్లించాలన్నారు. ఒక్కో ఎకరాకు 40 కేజీల చొప్పున ఐదెకరాల వరకు విత్తనాలు అందిస్తామని తెలిపారు. జేజీ 11, కాక్-2 రకాలు అందుబాటులో ఉన్నాయని, క్వింటా 7800 రూపాయలు కాగా సబ్సిడీ 1950 రూపాయలు వర్తిస్తుందని వివరించారు.

మందుబాబులకు జైలు, జరిమానా

గిద్దలూరు రూరల్: మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడిన వ్యక్తులకు సోమవారం గిద్దలూరు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె.భరత్‌చంద్ర జైలు శిక్ష విధించారు. కొమరోలులో మద్యం మత్తులో ట్రాక్టర్ నడుపుతూ పోలీసులకు పట్టుబడిన వ్యక్తికి 50 రోజుల జైలు శిక్షతోపాటు రూ.10 వేలు జరిమానా, అలాగే గిద్దలూరు పట్టణంలో మద్యం తాగి బైక్ నడుపుతూ పట్టుబడిన ఇద్దరు వ్యక్తులకు 20 రోజుల జైలు, రూ.10 వేల చొప్పున జరిమానా, బేస్తవారిపేటలో మద్యం తాగి బైక్‌లు నడుపుతున్న ఇద్దరు వ్యక్తులకు 20 రోజుల జైలు శిక్షతో పాటు రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు.

కుటీర పరిశ్రమలా నకిలీ మద్యం తయారీ

కూటమి ప్రభుత్వంలో ప్రజల ప్రాణాలతో చెలగాటం

- నాణ్యమైన మద్యం ఇస్తామని ఊదరగొట్టి నకిలీ సరుకు అంటగట్టడం దుర్మార్గం
- నకిలీ మద్యం రాకెట్‌పై సీబీఐ విచారణ చేపట్టి నిజాలు నిగ్గు తేల్చాలి
- మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్న వారికి ఏం శిక్షలు విధించారు?
- నిరసన ప్రదర్శనలో నిప్పులు చెరిగిన మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి అన్నా రాంబాబు
- ఎక్సైజ్ ఏఈఎస్ కార్యాలయం ఎదుట వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి ధర్నా



ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న అన్నా రాంబాబు, పార్టీ నాయకులు

మార్కాపురం టౌన్: కూటమి ప్రభుత్వంలో కల్తీ మద్యం తయారీని కుటీర పరిశ్రమలా మార్చి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు ధ్వజమెత్తారు. గ్రామాల్లో టీడీపీ, జనసేన సానుభూతిపరులు నిర్వహిస్తున్న బెల్ట్ షాపుల్లో కల్తీ మద్యాన్ని విచ్చలవిడిగా విక్రయిస్తూ అక్రమ సొమ్మును పోగేసుకోవడమే కాకుండా రాష్ట్ర ఆదాయానికి గండికొడుతున్నారని మండిపడ్డారు. కల్తీ మద్యం తాగి గడిచిన ఏడాది కాలంగా ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని, వేలాది మంది అనారోగ్యం బారిన పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. నకిలీ మద్యం రాకెట్ గుట్టు రట్టవడంతో కూటమి ప్రభుత్వంలో ముఖ్య నేతలు తప్పించుకునేందుకు కుట్రలకు తెర తీయడం సిగ్గు చేటని అన్నా రాంబాబు దుయ్యబట్టారు. కల్తీ మద్యం విషయంలో టీడీపీ, జనసేన నేతల వైఖరి, కూటమి ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ రణభేరి మోగించింది. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మార్కాపురంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబు ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ కార్యాలయం ముందు నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో కలిసి నిరసన తెలిపిన అనంతరం ఎక్సైజ్ సీఐ వెంకటరెడ్డికి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా అన్నా రాంబాబు మాట్లాడుతూ.. 2024 సార్వత్రిక ఎన్నికల్లో అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం నుంచి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన దాసరిపల్లి జయచంద్రారెడ్డి, అతని స్నేహితుడు కల్తీ మద్యాన్ని తయారు చేస్తూ పట్టుబడ్డారని, అవే మూలాలు కృష్ణాజిల్లా ఇబ్రహీంపట్నంలో కూడా బయటపడ్డాయని, దీంతో కల్తీ మద్యందారులు ఎవరో ప్రజలకు తెలిసిపోయిందన్నారు. తాము అధికారంలోకి వస్తే 99 రూపాయలకే నాణ్యమైన మద్యాన్ని ప్రజలకు అందిస్తామని తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు ఎన్నికలకు ముందు ఊదరగొట్టి, గద్దెనెక్కిన తర్వాత నాసిరకం మద్యాన్ని ప్రజలకు అంటగట్టేందుకు పక్కాగా స్కెచ్ వేశారని ధ్వజమెత్తారు. కల్తీ మద్యం రాకెట్ కీలక సూత్రధారులు టీడీపీకి చెందిన నాయకులేనని ఎక్సైజ్ అధికారులు వెల్లడించడంతో కూటమి ప్రభుత్వం తత్తరపాటుకు గురైందన్నారు. జాతీయ రహదారి పక్కనే కుటీర పరిశ్రమలాగా నకిలీ మద్యం తయారు చేయడంతోపాటు బెల్ట్ షాపులకు అదే మద్యాన్ని తరలించి వేల కోట్ల రూపాయలు పోగేశారని ఆరోపించారు. నకిలీ మద్యం రాకెట్‌లో కూటమి ప్రభుత్వ పెద్దల హస్తం ఉందని, సీబీఐ విచారణ చేపట్టి నిందితులు ఎంతటి వారైనా వదలకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం ఇస్తున్న అన్నా రాంబాబు, హనుమారెడ్డి తదితరులు



బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న అన్నా రాంబాబు, పార్టీ నాయకులు

ఊరూరా బెల్ట్ షాపులు

బెల్టు షాపులు నిర్వహిస్తే ఊరుకునేది లేదని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఎంత మందిపై చర్యలు తీసుకున్నారో చెప్పాలని అన్నా రాంబాబు నిలదీశారు. రాష్ట్రంలో ఏ ఒక్క మహిళపై అఘాయిత్యం జరిగినా ఆ వ్యక్తులకు అదే ఆఖరిరోజు అవుతుందని చెప్పారే కానీ ఎంత మంది నిందితులను శిక్షించారని ప్రశ్నించారు. మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు, లైంగిక దాడులకు తెగబడిన టీడీపీ నాయకులు, కార్యకర్తలను ప్రభుత్వ పెద్దలే వెనకేసుకురావడం రాష్ట్రంలో దుర్మార్గ పాలనకు నిదర్శనమన్నారు. ముందుగా బస్టాండ్ సెంటరులో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ర్యాలీగా ఎక్సైజ్ కార్యాలయానికి చేరుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్ఈసీ సభ్యుడు వెన్నా హనుమారెడ్డి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఉడుముల కోటిరెడ్డి, మార్కాపురం జెడ్పీటీసీ సభ్యుడు నారు బాపన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు చెంచిరెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షులు సలీమ్, మార్కాపురం, తర్లుపాడు ఎంపీపీలు బండి లక్ష్మీదేవి కృష్ణారెడ్డి, భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అంజమ్మ శ్రీనివాసులు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి జి.సత్యనారాయణరెడ్డి, పట్టణ అధ్యక్షుడు షేక్ సలీమ్, గౌస్ మొహిద్దీన్, కౌన్సిలర్లు కొత్త కృష్ణ, సిరాజ్, చాటకొండ చంద్ర, ఉత్తమ్ కుమార్, రోజ్‌లిడియా, ముత్తారెడ్డి వెంకటరెడ్డి, పార్టీ నాయకులు పీఎల్‌పీ యాదవ్, బట్టగిరి తిరుపతిరెడ్డి, శేషయ్య, నల్లబోతుల కొండయ్య, గౌస్ మొహిద్దీన్, చాంద్‌బాషా, నాలి కొండయ్య, పోరుమామిళ్ల విజయలక్ష్మి, గొట్టం నరసమ్మ, చెన్న క్రిష్ణమ్మ, బూదాల సతీష్, చాంద్‌బాషా, బూదాల గురవయ్య, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న డాకా పుల్లయ్య

బేస్తవారిపేట: పత్తి పంటపై దిగుమతి సుంకాలను 50 శాతం పెంచాలని ఏపీ రైతు సంఘం గిద్దలూరు నియోజకవర్గ కార్యదర్శి డాకా పుల్లయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం బేస్తవారిపేట మండలంలోని మోక్షగుండం గ్రామంలో ఏఐకేఎస్ ఆధ్వర్యంలో పత్తి రైతులను ఆదుకోవాలని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆగస్టు 15న ఎర్రకోటపై ప్రధాని మోదీ మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి ఆదుకుంటామని చెప్పిన మూడు రోజులకే పత్తిపై దిగుమతి సుంకాన్ని తగ్గించి తీరని అన్యాయం చేశారన్నారు. 2014 నుంచి ఆత్మహత్య చేసుకున్న ప్రతి రైతు కుటుంబానికి రూ.25 లక్షల చొప్పున నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం సచివాలయంలో కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జోసెఫ్, కొండయ్య, రైతులు పాల్గొన్నారు.

ఉత్తమ వ్యక్తిత్వ వికాస ట్రైనర్‌గా రవిచంద్ర



సర్టిఫికెట్ అందుకుంటున్న రవిచంద్ర

మార్కాపురం: ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ వ్యక్తిత్వ వికాస ఉత్తమ ట్రైనర్‌గా మార్కాపురం పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు, పండిత పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం రవిచంద్ర కుమార్ ఎంపికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హోటల్లో నిర్వహించిన కార్యక్రమంలో బోర్డ్ మెంబర్ ఆదినారాయణరెడ్డి, వ్యవస్థాపకుడు గంపా నాగేశ్వరరావు చేతులమీదుగా ఆయన సర్టిఫికెట్ అందుకున్నారు. 30 రోజులపాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి రెండు రాష్ట్రాల నుంచి 120 మంది హాజరయ్యారని రవిచంద్ర తెలిపారు. టైం మేనేజ్‌మెంట్, గోల్ సెట్టింగ్, కెరీర్ గైడెన్స్, యాంటీ టుబాకో, యాంటీ డ్రగ్స్, సోషల్ మీడియా అవేర్‌నెస్ తదితర అంశాలపై శిక్షణ తీసుకున్నట్లు రవిచంద్ర వివరించారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు నిరసనగా..

15 నుంచి కోటి సంతకాల సేకరణ

మార్కాపురం: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ, పీపీపీ విధానంలో నిర్మించేందుకు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు నిరసనగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నియోజకవర్గంలో ఈనెల 15వ తేదీ నుంచి మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు ఆధ్వర్యంలో ప్రారంభమవుతుందని ఆ పార్టీ నియోజకవర్గ కార్యాలయ ప్రతినిధి సోమవారం తెలిపారు. ఈనెల 15వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు పొదిలిలో, 12 గంటలకు ఉప్పలపాడులో, సాయంత్రం 4 గంటలకు మండల కేంద్రమైన కొనకనమిట్లలో సంతకాల సేకరణ నిర్వహించనున్నట్లు వివరించారు. 16వ తేదీ ఉదయం 10 గంటలకు మార్కాపురం మండలంలోని బోడపాడులో, సాయంత్రం 4 గంటలకు మార్కాపురం పట్టణంలోని 35వ వార్డులో, 17వ తేదీ సాయంత్రం 6 గంటలకు తర్లుపాడులో కోటి సంతకాల కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రజలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆవులయ్య

గిద్దలూరు రూరల్: వీఓఏల సమస్యలు పరిష్కరించడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ నాయకుడు టి.ఆవులయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన వీఓఏల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వీఓఏల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామ సంఘాల సమాఖ్య ఆన్‌లైన్ వర్కు నిలుపుదల చేయడంతో వీఓఏల కాల పరిమితి సర్క్యులర్ రద్దయిందన్నారు. వీఓఏలు ఐకమత్యంతో ఉండి సమస్యల పరిష్కారానికి పోరాడాలని సూచించారు. గౌరవ వేతనం సమాఖ్య అకౌంట్‌లో కాకుండా వీఓఏల ఖాతాల్లో వేయాలని కోరారు. అర్హత ఉన్న వీఓఏలకు సీసీలుగా నియమించాలని, ప్రతి వీఓఏకు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం వీఓఏల సంఘ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా నాగలక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా ఎం.పార్వతి, ప్రధాన కార్యదర్శిగా జి.మాబున్ని, సహాయ కార్యదర్శిగా నాగమల్లేశ్వరి, కోశాధికారిగా గంగాదేవి, కమిటీ సభ్యులుగా భాగలక్ష్మి, లక్ష్మీదేవి, స్వాతి, భవానీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి



ఆర్టీసీ డీఎంకు వినతిపత్రం అందిస్తున్న ఎంపీజే నాయకులు

తర్లుపాడు: మండలంలోని తుమ్మలచెరువు పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు బస్ సౌకర్యం కల్పించాలని ఎంపీజే ఆధ్వర్యంలో మార్కాపురం డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులుకు సోమవారం వినతిపత్రం అందించారు. చుట్టుపక్కల గ్రామాలైన బుడ్డపల్లి, కేతగుడిపి, సూరేపల్లి, జగన్నాథపురం తదితర గ్రామాల నుంచి వందల మంది విద్యార్థులు సుమారు 3 కిలోమీటర్ల మేర నడిచి స్కూల్‌కు వెళ్తున్నట్టు డిపో మేనేజర్ దృష్టికి తీసుకువెళ్లారు. మండలంలో తుమ్మలచెరువు మీదుగా పొదిలికి, మండల కేంద్రం తర్లుపాడుకు గ్రామాల నుంచి బస్సులు నడపాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎంపీజే మార్కాపురం పట్టణ అధ్యక్షుడు మీరావలి, సభ్యులు రసూల్, అమీర్, మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- నవంబర్ 3 నుంచి నిరవధిక సమ్మెకు సిద్ధం



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు కార్మికులు, సీపీఐ నాయకులు

మార్కాపురం టౌన్: మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేదంటే నవంబర్ 3 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని సీపీఐ నాయకులు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అందె నాసరయ్య, జిల్లా కార్యదర్శి ఎస్‌కే ఖాశీం డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ కార్యాలయం నుంచి మున్సిపల్ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు రెండేళ్లుగా వేతనాన్ని పెంచలేదన్నారు. రిటైర్ అయిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కార్మికులకు కొబ్బరినూనె, సబ్బులు ఇవ్వాలని కోరారు. కార్మికులకు పనిముట్లను వెంటనే ఇవ్వాలని, వివిధ సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్, కాంట్రాక్టు కార్మికుల నాయకులు హరిబాబు, రామయ్య, వెంకటయ్య, మహిళా కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల మండలంలో మోస్తరు వర్షం



పంచాయతీ కార్యాలయం వద్ద నిలిచిన వర్షం నీరు



గొట్లగట్టులో కురుస్తున్న వర్షం

కొనకనమిట్ల: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. కంది, పత్తి, ఆముదం పంటలకు, రబీలో సాగు చేసిన మినుము, అలసంద, మిరప, వరి, కూరగాయల పంటలకు వర్షం మేలు చేస్తుందని రైతులు చెబుతున్నారు. మరికొందరు రైతులు మిరప, వరి, పొగాకు సాగుకు సన్నద్ధమవుతున్నారు. కాగా గొట్లగట్టులో కురిసిన వర్షానికి బస్టాండ్ సెంటర్ నుంచి గ్రామంలోకి వెళ్లే రోడ్డులో భారీగా నీరు నిల్వ చేరింది.

కొండను పిండేస్తున్నారు!



టిప్పర్‌తో గ్రావెల్ తరలింపు

మార్కాపురం: మార్కాపురం మండలంలోని కుంట-కోలభీమునిపాడు మధ్య ముద్దసానమ్మ కొండను అక్రమార్కులు యథేచ్ఛగా తవ్వి గ్రావెల్‌ను టిప్పర్లతో తరలిస్తున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొందరు తాము ఏర్పాటు చేస్తున్న వెంచర్లను చదును చేసేందుకు గత కొద్ది రోజులుగా గ్రావెల్ అక్రమ రవాణా చేస్తున్నారు. మార్కాపురం జిల్లా అవుతుందన్న రియల్ ఎస్టేట్ వ్యాపారుల ప్రచారం నేపథ్యంలో పలువురు పొలాలు కొని వెంచర్లు వేసి చదును చేసేందుకు కొండ మట్టిని తరలిస్తున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా సాగుతున్న ఈ దందాను అడ్డుకోవాల్సిన గనుల శాఖాధికారులు చోద్యం చూస్తుండటం విమర్శలకు తావిస్తోంది. ఈ కొండకు సమీపంలోనే ముద్దసానమ్మ ఆలయం ఉంది. దసరా ఉత్సవాల సమయంలోనూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు దర్జాగా జేసీబీలు, టిప్పర్లు వినియోగించి కొండను తొలిచినట్లు స్థానికులు చెబుతున్నారు. అమ్మవారి పేరు మీద ఉన్న కొండను తవ్వడంపై కోలభీమునిపాడు గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి అక్రమ తవ్వకాలను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



మత్తు నెత్తికెక్కి..!



మద్యం మత్తులో పడిపోయిన యువకుడు

గిద్దలూరు రూరల్: లైసెన్స్‌డ్ లిక్కర్ దుకాణాలతోపాటు బెల్ట్ షాపులు ఇబ్బడిముబ్బడిగా తెరిచి పగలూ రాత్రి తేడా లేకుండా మద్యం విక్రయిస్తుండటంతో కాపురాలు గుల్లవుతున్నాయని, పేద, మధ్య తరగతి కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. సోమవారం గిద్దలూరు పట్టణంలోని రాచర్ల గేటు సమీపంలో గల ఆంజనేయస్వామి గుడి దగ్గర నల్లబండ బజారుకు చెందిన ఓ యువకుడు పూటుగా మద్యం తాగి ఇంటికి చేరుకోలేని పరిస్థితిలో పడిపోయాడు. గిద్దలూరు పట్టణంలో మందుబాబులు ఎక్కడపడితే అక్కడ సోయ లేకుండా పడిపోవడం, తరచూ ఇలాంటి దృశ్యాలే కనిపిస్తుండటంతో జనం విస్తుపోతున్నారు.